సాక్షి
తిరుపతి
మంగళవారం । 31 । జనవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.50,090
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,278
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.70,600
రిటైల్ వెండి గ్రాము	రూ.72.60

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	31	19
చిత్తూరు	32	19
తిరుమల	27	16
గూడూరు	32	22
నగరి	32	22



త్రిశూల స్నానానికి ఏర్పాట్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో త్రిశూల స్నానానికి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జల వినాయకస్వామి ఆలయ సమీపంలోని స్వర్ణముఖి నదిలో ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నారు.

న్యూస్‌రీల్

నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

తిరుపతి ఎడ్యుకేషన్ : జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఫిబ్రవరి 8వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు తిరుపతి వరదరాజ నగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి మరింత సమాచారానికి 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన ఉండాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి

తిరుపతి తుడా : కుష్టు వ్యాధి లక్షణాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి తెలిపారు. తిరుపతిలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద సోమవారం ఆయన కుష్టు వ్యాధి నివారణ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కుష్టు వ్యాధి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించిందన్నారు. బహుళ ఔషధ చికిత్సలతో వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని చెప్పారు. కుష్టు వ్యాధి వంశపారంపర్యంగా వచ్చేది కాదన్నారు. ఆరు నుంచి 12 నెలల వరకు చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం చేసుకోవచ్చని చెప్పారు. ఈ ర్యాలీలో కుష్టు, టీబీ అధికారి డాక్టర్ అరుణసులోచనాదేవి, ఇతర వైద్యాధికారులు హనుమంతరావు, సుధారాణి, శాంతకుమారి, శ్రీనివాసరావు, మధుబాబుతో పాటు నర్సింగ్ విద్యార్థులు, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. అంతకుముందు మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన ఘన నివాళులర్పించారు.

శ్రీవారి సేవలో కాజల్ అగర్వాల్



సినీనటి కాజల్ అగర్వాల్

తిరుమల: తిరుమల శ్రీవారిని సోమవారం ఎమ్మెల్యేలు వెల్లంపల్లి శ్రీనివాస్, అప్పలనాయుడు, ఎంపీలు తేజస్వి సూర్య, చంద్రశేఖర్, హాస్యనటులు చిట్టిబాబు, కృష్ణ భగవాన్, సినీనటి కాజల్ అగర్వాల్, పాప్ కార్న్ సినిమా చిత్ర బృందం సభ్యులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఆధ్యాత్మిక నగర అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. శివారు ప్రాంతాలను సైతం మరింత అభివృద్ధి చేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగానే గతంలో ఎన్నడూ లేని విధంగా మూడున్నరేళ్లలో కోట్లాది రూపాయలను వెచ్చించింది. నలభై ఏళ్లుగా ఎలాంటి అభివృద్ధికీ నోచుకోని నగర తూర్పు భాగమైన కొర్లగుంట పరిసర ప్రాంతాలను సైతం శరవేగంగా అభివృద్ధి చేస్తోంది. స్థానికుల సహకారం, నాయకుల చొరవతో మాస్టర్‌ప్లాన్ రోడ్లను నిర్మిస్తోంది. నగరానికి కనెక్టవిటీ పెంచుతూ.. ప్రధాన రోడ్లను కలుపుతూ.. రోడ్లు నిర్మించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



ట్రాఫిక్ కష్టాలు తీరేలా..

నగరం విస్తరించేలా!



దాదాపుగా పూర్తయిన అంకుర హాస్పిటల్ వద్ద ఉన్న మాస్టర్ ప్లాన్ రోడ్డు



ఇటీవల అభివృద్ధి చేసిన వైఎస్సార్‌మార్గ్

- తిరుపతిలో ప్రతిష్టాత్మకంగా మాస్టర్‌ప్లాన్ రోడ్లు
- ఏకకాలంలో రూ.40 కోట్లతో 14 రోడ్ల నిర్మాణం
- ఇప్పటికే తుది దశకు చేరుకున్న 11 రోడ్లు
- ప్రధాన ఆకర్షణగా వైఎస్సార్, అన్నమయ్య మార్గ్
- కనెక్టివిటీ, ప్రధాన రోడ్లపైనే నేతల దృష్టి

తిరుపతి తుడా: అనేక విద్యాలయాలు.. బహుళజాతి కంపెనీలు, మాల్స్.. హోటళ్లు.. ఇతరత్రా అభివృద్ధి చెందుతున్నా ఆ స్థాయిలో రోడ్లు లేకపోవడంతో తిరుపతి నగరానికి కొంత వెలితిగా ఉంది. ఆర్టీసీ బస్టాండుకు కూతవేటు దూరంలో ఉన్న తూర్పు ప్రాంతం ఎలాంటి అభివృద్ధికీ నోచుకోకపోవడం ప్రధాన లోటుగా కనిపిస్తోంది. అటు కరకంబాడి రోడ్డు.. ఇటు రేణిగుంట రోడ్డు ప్రాంతాలకు సరైన కనెక్టివిటీ రోడ్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నగరంలోకి ఇతర ప్రాంతాల నుంచి వాహనాలు రావడానికి మూడు ప్రధాన రోడ్లే దిక్కుగా ఉండడంతో ట్రాఫిక్ ఉచ్చులో చిక్కుకుపోవాల్సి పరిస్థితి ఎదురవుతోంది. ఉన్న రోడ్లపై మరింత ఒత్తిడి పెరగడం.. మాల్స్, మార్కెట్లు, సినిమా థియేటర్లు, స్కూల్స్, కాలేజీలు, గోడౌన్‌లు, హోటల్స్ వంటివి ఇరుకు రోడ్లలోనే ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య అధిగమించేలా.. నగరం మరింత విస్తరించేలా ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రోడ్లకు శ్రీకారం చుట్టింది.

రూ.40 కోట్లతో 'మాస్టర్' ప్లాన్

ట్రాఫిక్ సమస్యను అధిగమించాలంటే నగర రోడ్లతోపాటు, కనెక్టివిటీ రోడ్లను విస్తరించాలని స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి భావించారు. ఈ క్రమంలో కొత్త రోడ్లు, కనెక్టివిటీ రోడ్లకు శ్రీకారం చుట్టారు. ఏక కాలంలో 14 మాస్టర్‌ప్లాన్ రోడ్లను రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించేలా ప్రణాళిక రచించారు. 40 ఏళ్లలో ఎవ్వరూ సాహసం చేయలేని పనులను పూర్తిచేస్తున్నారు. ఇప్పటికే 11 రోడ్లు గ్రావెల్ పనులు పూర్తిచేసుకోగా.. మిగిలిన వాటినీ శరవేగంగా నిర్మించేలా చర్యలు ముమ్మరం చేశారు. 2040 తిరుపతి నగర బృహత్ ప్రణాళికలను దృష్టిలో ఉంచుకొని మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. రోడ్ల నిర్మాణానికి టీటీడీ నుంచి రావాల్సిన సుమారు రూ.10 కోట్ల బకాయిలను రాబట్టడంతోపాటు తుడా సహకారం, మున్సిపల్ కార్పొరేషన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా నిధులు సేకరిస్తున్నారు.

తూర్పున ఉదయిస్తున్న అభివృద్ధి

మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధితో తూర్పు ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. రేణిగుంట రోడ్డు -కరకంబాడి రోడ్లను కలుపుతూ అన్నమయ్యమార్గ్, తిరుమల బైపాస్ రోడ్డు నుంచి హీరోహోండా షోరూమ్ రైల్వే గేట్ వరకు వయా డీబీఆర్ రోడ్డు మీదుగా వైఎస్సార్ మార్గ్‌ను ఇటీవలే విశాలంగా అభివృద్ధి చేశారు. అలాగే మిగిలిన మాస్టర్‌ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేయడం వల్ల తూర్పున సుమారు 3,500 ఎకరాల్లో తిరుపతి నగరం విస్తరించనుంది. కరకంబాడిరోడ్డు - రేణిగుంట రోడ్లను కలుపుతూ తిరుపతి అర్బన్ పరిధిలో 8 మాస్టర్‌ప్లాన్ రోడ్లు అందుబాటులోకి తీసుకురానున్నారు.

టీడీఆర్ పద్ధతిలో భూసేకరణ

రహదారుల నిర్మాణానికి అవసరమైన భూమిని ట్రాన్స్ఫర్ డెవలప్మెంట్ రైట్స్ (టీడీఆర్) సర్టిఫికెట్లు ఇవ్వడం ద్వారా భూసేకరణ దాదాపుగా పూర్తిచేశారు. ట్రాఫిక్ కష్టాలను గుర్తించిన ప్రజలు భూములు, స్థలాలను ఇచ్చేందుకు మొగ్గుచూపుతున్నారు. 14 రోడ్లు అభివృద్ధి చేస్తుంటే కేవలం ఆరేడుగురు మాత్రమే అయిష్టాన్ని వ్యక్తంచేస్తూ కోర్టు మెట్లు ఎక్కారు. అధికారులు, నేతలు వారిని కూడా ఒప్పించి టీడీఆర్ బాండ్లను ఇచ్చి రోడ్ల అభివృద్ధికి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ కష్టాలు తీరుస్తూ.. నగరం విస్తరించాలని ఆకాంక్షిస్తున్నారు.

14 మాస్టర్‌ప్లాన్ రోడ్లు ఇవే

- కరకంబాడి – రేణిగుంట రోడ్డు వయా తిమ్మినాయుడుపాళ్యం, కాటన్‌మిల్ రైల్వే గేట్ వరకు 80 అడుగుల వెడల్పు, 2 కి.మీ పొడవుతో రోడ్డు. వాహనాలు తిరుపతిలోకి ప్రవేశించకుండా కరకంబాడి -రేణిగుంట రోడ్లను కలపడం.
- వినాయకసాగర్ రిసార్ట్ ఎదురుగా నుంచి తిరుపతి అర్బన్ పరిధి వరకు 80 అడుగుల వెడల్పుతో 1.5 కి.మీ రోడ్డు.
- కరకంబాడి రోడ్డు డీ-మార్ట్‌కు ఎదురుగా 60 అడుగుల వెడల్పుతో 0.6 కి.మీ రోడ్డు.
- డీ-మార్ట్‌కు తూర్పువైపు భారత్ పెట్రోల్ బంక్ నుంచి 60 అడుగుల వెడల్పుతో 0.6 కి.మీ రోడ్డు.
- కొర్లగుంట మెయిన్ రోడ్డు 40 అడుగుల వెడల్పు, 1.2 కి.మీ పొడవుతో మోడరన్ స్ట్రీట్‌గా అభివృద్ధి.
- అక్కారంపల్లి రోడ్డును హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి 40 అడుగుల వెడల్పుతో 0.8 కి.మీ పొడవున అభివృద్ధి.
- ఆర్టీసీ బస్టాండు -హీరో హోండా రైల్వేగేట్ వయా చింతలచేను రోడ్డు. ఎంఎస్ సుబ్బలక్ష్మి కూడలి నుంచి చింతలచేను మీదుగా 80 అడుగుల వెడల్పు, 1.2 కి.మీ పొడవున రోడ్డు నిర్మిస్తున్నారు.
- హీరో హోండా షోరూమ్ -కాటన్‌మిల్ రైల్వే గేట్ వరకు 100 అడుగుల వెడల్పుతో 1.3 కి.మీ మేర రోడ్డు. రేణిగుంట రోడ్డుకు ప్రత్యామ్నాయంగా ఇది ప్రధాన రహదారిగా మారనుంది. ఎంఎస్ సుబ్బులక్ష్మి విగ్రహం నుంచి చింతల చేనుమీదుగా కాటన్ మిల్ వరకు, అలానే తిమ్మినాయుడుపాళ్యం నుంచి కాటన్ మిల్ వరకు నిర్మిస్తున్న 80 అడుగుల రోడ్డుకు లింక్ రోడ్డుగా నిలవనుంది.
- గొల్లవానిగుంట మాస్టర్‌ప్లాన్ రోడ్డును రేణిగుంట రోడ్డు నుంచి గొల్లవానిగుంట చివరి వరకు 60 అడుగుల వెడల్పు, 1.2 కి.మీ మేర విస్తరించనున్నారు. దీన్ని రేణిగుంట రోడ్డు -నేషనల్ హైవే తిరుచానూరు కూడలి వరకు పొడిగించేలా ప్రణాళిక.
- గొల్లవానిగుంట- సీపీఆర్ లింక్ రోడ్డు గొల్లవానిగుంట రోడ్డు నుంచి అంకుర హాస్పిటల్ రోడ్డును కలుపుతూ 60 అడుగుల రోడ్డు. తొలిదశలో 0.7 కి.మీ పొడవుతో విస్తరణ.
- పూలవాణిగుంట– రేణిగుంట రోడ్డు నుంచి దక్షిణం వైపు పలు ప్రాంతాలను కలుపుతూ (తిరుపతి అర్బన్ పరిధి వరకు) 80 అడుగుల వెడల్పు, 1.2 కి.మీ మేర రోడ్డు విస్తరణ.
- అంకుర హాస్పిటల్‌కు తూర్పు నుంచి పూలవాణిగుంట వరకు 60 అడుగుల వెడల్పు, 0.5 కి.మీ పొడవుతో మాస్టర్‌ప్లాన్ రోడ్డు. ప్రస్తుతం డివైడర్ పనులు జరుగుతున్నాయి.
- హీరోహోండా షోరూమ్‌కు ఆనుకుని రేణిగుంట రోడ్డు నుంచి పద్మావతిపురం హైస్కూల్ వరకు 60 అడుగుల వెడల్పు, 2కి.మీ పొడువుతో రోడ్డు నిర్మాణం.
- డీబీఆర్ -చింతలచేను మాస్టర్‌ప్లాన్ రోడ్లను కలుపుతూ 40 అడుగుల వెడల్పు, 0.5 కి.మీ పొడవుతో రోడ్డు నిర్మాణం.



ఎంఎస్ సుబ్బలక్ష్మి కూడలి - హీరో హోండా రైల్వేగేట్ వయా చింతలచేను మాస్టర్‌ప్లాన్ రోడ్డు



పద్మావతిపురం - రేణిగుంట రోడ్డు



కరకంబాడి రోడ్డు-డీ-మార్ట్‌కు తూర్పున..



అక్కారంపల్లి మాస్టర్‌ప్లాన్ రోడ్డు



కాటన్‌మిల్ రైల్వేగేట్ వద్ద ముమ్మరంగా పనులు

ప్రజల సహకారంతోనే..



మాస్టర్‌ప్లాన్ రోడ్ల అభివృద్ధికి ప్రజలు అందించిన సహకారం మరువలేను. తిరుపతి నగరం కొంత భాగంలోనే విస్తరించడం వల్ల ట్రాఫికష్టాలు వేధిస్తున్నాయి. గనరానికి సరైన కనెక్టివిటీ రోడ్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నాం. దీనివెనుక విజన్ ఉంది. ట్రాఫిక్ కష్టాలు తీరాలన్నా, నగరం విస్తరించాలన్నా, కనెక్టివిటీ పెరగాలన్నా రోడ్ల అభివృద్ధితోనే సాధ్యం. ఆ ఆలోచనలతోనే రోడ్లను అభివృద్ధి చేయాలని నిశ్చయించుకున్నాం.

– భూమన అభినయ్ రెడ్డి , డిప్యూటీ మేయర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్

40 నుంచి 120 అడుగుల రోడ్లు

మాస్టర్‌ప్లాన్లో భాగంగా 40 నుంచి 120 అడుగుల వెడల్పుతో రోడ్లు అందుబాటులోకి రానున్నాయి. కరకంబాడి – రేణిగుంట రోడ్డును కలుపుతూ మరో రోడ్డు, ఈ రెండు రోడ్లను కలుపుతూ చింతలచేను, రేణిగుంట రోడ్డుకు ప్రత్యామ్నాయంగా (రైల్వే ట్రాక్‌కు ఉత్తరం వైపు) వంద అడుగుల రోడ్డును అభివృద్ధి చేస్తున్నారు. వీటికి మరో ఐదు కనెక్టివిటీ రోడ్లను నిర్మిస్తున్నారు. రేణిగుంట రోడ్డు నుంచి పద్మావతి పురం, తిరుచానూరు వరకు మరో రెండు రోడ్లను కలిపేలా (తిరుపతి అర్బన్ పరిధి) వరకు మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. ఈ రోడ్లను కలుపుతూ లింక్ రోడ్లను నిర్మిస్తున్నారు. ఇవన్నీ మరో నాలుగైదు నెలల్లో పూర్తిచేసుకుని అందుబాటులోకి రానున్నాయి.

చేతివృత్తులకు చేదోడు.. వాదోడు

- ఆర్థిక భరోసానిస్తున్న జగనన్న చేదోడు
- జిల్లాలో మూడో విడతలో 10,813 మందికి లబ్ధి
- లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో రూ.10.813 కోట్లు జమ
- కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి వెల్లడి



జగనన్న చేదోడు చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: జగనన్న చేదోడు పథకం పేదలకు వరంలా మారిందని, వారి కుటుంబానికి చేదోడు.. వాదోడుగా నిలుస్తోందని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం జగనన్న చేదోడు పథకం మూడో విడత కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు జిల్లా వినుకొండ నుంచి ప్రారంభించగా.. అదే సమయంలో తిరుపతి కలెక్టరేట్ కార్యాలయం నుంచి సీఎం ప్రసంగాన్ని జగనన్న చేదోడు పథకం లబ్ధిదారులు వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం మూడో విడతలో జిల్లాకు చెందిన 10,813 మందికి ఒక్కొక్కరికీ రూ.10వేలు చొప్పున మొత్తం రూ.10.813 కోట్లు సంబంధిత లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేసినట్టు వెల్లడించారు. రజక, నాయీబ్రాహ్మణ, దర్జీ, అక్కచెల్లెమ్మల సంక్షేమం కోసం అర్హత కలిగిన లబ్ధిదారులకు సంవత్సరానికి రూ.10 వేల చొప్పున ఐదేళ్లలో రూ.50 వేల వరకు ఆర్థిక సహాయం చేయాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్టు తెలిపారు. అనంతరం మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఇంకా అర్హత ఉండి ఎవరైనా మిగిలిపోయి ఉంటే అలాంటి వారు మళ్లీ సంబంధిత సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే వచ్చే జూన్, డిసెంబర్ నెలల్లో జగనన్న చేదోడు వచ్చేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికార అధికారి భాస్కర్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఏఈఓ బాబురెడ్డి, బీసీ సంక్షేమశాఖ, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చాలా సంతోషంగా ఉంది



మాది నిరుపేద కుటుంబం. నా భర్త సున్నం పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయన సంపాదన మా పిల్లల చదువుకు, కుటుంబానికి సరిపోయేది కాదు. నేను టైలరింగ్ చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడు ఉండేదాన్ని. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న చేదోడు పథకం కింద రెండు విడతల్లో రూ.20 వేలు అందజేసింది. ఆ సొమ్ముతో కొత్త మోడల్ టైలరింగ్ మిషన్, జిగ్‌జాగ్ మిషన్ కొన్నా. ఇప్పుడు నా ఆదాయం నెలకు రూ.10వేల పైనే వస్తోంది. చాలా సంతోషంగా ఉంది.

–సుభాషిణి, చైతన్యపురం, తిరుపతి, టైలర్

వేద వారసత్వాన్ని భావితరాలకు అందించాలి



విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, అధికారులు

తిరుపతి అలిపిరి: వేద వారసత్వాన్ని, విజ్ఞానాన్ని భావితరాలకు అందించేందుకు యూనివర్సిటీ, వేద పాఠశాలల వేదపండితులు సమిష్టిగా కృషి చేయాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతిలోని ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో సోమవారం వేద విద్య, పరిపాలనా అంశాలపై వైస్‌చాన్సలర్ రాణిసదాశివ మూర్తి, జేఈఓ సదాభార్గవితో కలిసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ టీటీడీ వేద పాఠశాలలన్నింటిలో ఒకే రకమైన పాఠ్యాంశాలు కలిగి ఉండేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించి దాన్ని ఎస్వీయూకు అనుబంధంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. తరువాత దశలవారీగా రాష్ట్రంలోని అన్ని వేద పాఠశాలలు, దేశ వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ వేద పాఠశాలలను కూడా ఎస్వీయూ పరిధిలోకి తీసుకురావాలని చెప్పారు. తద్వారా 'మన ప్రాచీన జ్ఞానాన్ని ముందుకు తీసుకెళ్లడానికి బలమైన పునాది' పడుతుందన్నారు. అంతకుముందు ఎస్వీ వేద విశ్వవిద్యాలయం, టీటీడీ ఆధ్వర్యంలో నడిచే అన్ని వేద పాఠశాలల ప్రిన్సిపాళ్లు వివిధ సమస్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈఓకు వివరించారు. సమస్యల పరిష్కారానికి అకడమిక్ బాడీని ఏర్పాటు చేసి నెలవారీ సమావేశాలు నిర్వహించాలని ఈఓ ఆదేశించారు. ఒక్కో డీన్‌కు ఒక్కో సంస్థను కేటాయించి, టీటీడీ వేద పాఠశాలలన్నింటినీ తనిఖీ చేయాలని వీసీకి సూచించారు. అనంతరం వీసీ ఆహ్లాదకర వాతావరణాన్ని పెంపొందించేలా ప్రతిపాదిత ప్రణాళికను ఈఓకు వివరించారు. వేద విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రాధేశ్యామ్, డీఈఓ భాస్కర్ రెడ్డి, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఈఈ మల్లిఖార్జున ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు సమస్యలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: స్పందనలో వచ్చే అర్జీలను గడువులోపు పరిష్కరించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన డీఆర్వో ఎం.శ్రీనివాసరావు, జీఎస్ఎస్ఎస్ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కోదండరామిరెడ్డి, ఎస్‌డీసీ భాస్కర్‌నాయుడుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 130 అర్జీలు వచ్చినట్టు కలెక్టర్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

వస్తువుల కొనుగోలులో నాణ్యత తప్పనిసరి


మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసరావు

తిరుపతి అర్బన్: వినియోగదారులు, ప్రభుత్వ అధికారులు వస్తువులను కొనుగోలు చేసే సమయంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం తిరుపతి కలెక్టరేట్‌లో బీఐఎస్(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్)కు సంబంధించిన అవగాహన సదస్సును నిర్వహించారు. విజయవాడ నుంచి ఆ సంస్థ జాయింట్ డెరెక్టర్లు సుజాత, రమాకాంత్ హాజరయ్యారు. వారు ముందుగా పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వస్తువుల కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. లైసెన్స్‌లు లేకుండా విక్రయించే వారికి జైలు శిక్ష, జరిమానాలుంటాయని హెచ్చరించారు. బీఐఎస్ వైబ్‌సైట్‌ను పరిశీలించి వస్తువులను కొనుగోలు చేయాలని సూచించారు. ప్రధానంగా సిమెంట్, స్టీల్, మెడికల్‌కు చెందిన వస్తువులు, బంగారం, తినుబండారాలు, ఎలెక్ట్రికల్ పరికరాలు తదితర 458 వస్తువులను కొనుగోలు చేసే సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని చెప్పారు. సివిల్ సప్లయ్ జిల్లా అధికారి ఎంవీ ప్రసాద్, జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ ప్రతాప్, మహిళా శిశుసంక్షేమ అధికారి జయలక్ష్మి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డెరెక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

ఆదిత్య ఎల్‌-1కు పేలోడ్ అందజేత


ఆదిత్య ఎల్‌-1లో అమర్చబోయే పేలోడ్ నమూనాను అందజేస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనసంస్థ (ఇస్రో) సూర్యుడిపై పరిశోధనకు ఈ ఏడాది పీఎస్ఎల్‌వీ రాకెట్ ద్వారా ప్రయోగించనున్న ఆదిత్య-ఎల్1 ఉపగ్రహంలోని విజిబుల్ లైన్ ఎమిషన్ కరోనాగ్రాఫ్ (వీఈఎల్‌సీ) అనే పేలోడ్‌ను బెంగళూరులోని యూఆర్‌రావు స్పేస్ సెంటర్ డైరెక్టర్ ఎం.శంకరన్ అందజేశారు. ఈనెల 26న రిపబ్లిక్‌డే సందర్భంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ వారిచే ఇస్రో చైర్మన్ సోమనాథ్ సమక్షంలో దీన్ని అందజేశారు. సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు రూపొందించిన ఈ పేలోడ్‌ను రిపబ్లిక్‌డే వేడుకల్లో అందజేసినట్టు ఇస్రో తన వెబ్‌సైట్‌లో సోమవారం నాడు పేర్కొంది. 1,475 కేజీలు బరువు కలిగిన ఆదిత్య ఎల్1 ఉపగ్రహంలో ఆరు పేలోడ్స్ అమర్చి పంపుతున్నారు. వీటి బరువు 244 కిలోల వరకు ఉంటాయి. సూర్యుని వలయంలో ఉన్న పరిస్థితులను అధ్యయనం చేసేందుకు యాస్‌పెక్స్, సూట్, వెల్సి, హెలియోస్, పాపా, సోలెక్స్ అనే అరు ఉపకరణాలు (పేలోడ్స్) రూపొందించి ఉపగ్రహాన్ని తయారుచేస్తున్నారు. ఇందులో విజబుల్ లైన్ ఎమిషన్ కరోనాగ్రాఫ్ (వీఈఎల్‌సీ) అనే పరికరాన్ని మాత్రమే సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ వారు రూపొందించారు. దీని బరువు 90 కేజీల దాకా ఉంటుంది. ఇది 1.7, 1.1, 0.7 మీటర్ల పరిమాణంలో ఉంటుంది. సోలార్ డిస్క్ నుంచి వేరు చేయడానికి, డిస్క్ నుంచి కాంతిని విస్మరించడానికి ఒక యంత్రాన్ని కలిగి ఉంటుంది. కరోనా నుంచి కాంతి తదుపరి ప్రాసెసింగ్ కోసం కరోనాగ్రాఫ్ ద్వారా సంగ్రహించనుంది. సూర్యుని ఉపరితలం కేవలం ఆరువేల డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువగా ఉన్నపుడు కరోనా ఉష్ణోగ్రత మిలియన్ డిగ్రీలకు ఎలా చేరుకోగలదో పరిష్కరించేందుకు అవసరమైన డేటాను సేకరిస్తుంది. అయితే సూర్యుడి అంతర్భాగ ఉష్ణోగ్రత ఆరు వేల కెల్విన్ డిగ్రీలు దాటి పోతుండడం, కరోనాలో వేడి పెరిగిపోతుండడానికి కారణం అంతు చిక్కడం లేదు. ఈ అంశంపై ఆదిత్య-ఎల్1 దృష్టి సారించి పరిశోధనలు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. అంతా సవ్యంగా జరిగితే ఈ ఏడాది జూన్, జులైకంతా ఆదిత్య-ఎల్1 ప్రయోగాన్ని పూర్తి చేయడానికి ప్రొఫెసర్ యూఆర్‌రావు స్పేస్ సెంటర్ వారు ఉపగ్రహాన్ని రూపొందిస్తున్నారు.


ఆరు పేలోడ్‌లలో 90 కేజీల బరువు కలిగిన విజబుల్ లైన్ ఎమిషన్ కరోనా గ్రాఫ్ పేలోడ్ ఇదే

తిరుమలలో ముగ్గురు దళారీల అరెస్టు

- శ్రీవారి దర్శన టికెట్లను అధిక ధరలకు విక్రయించిన ఇద్దరు
- నకిలీ బ్రేక్ దర్శన టికెట్లను మోసగించిన మరో వ్యక్తిపై కేసు

తిరుమల : శ్రీవారి దర్శన టికెట్లను అధిక ధరలకు విక్రయించిన ఇద్దరు దళారులతోపాటు, నకిలీ బ్రేక్ దర్శనం అప్పగించిన మరో వ్యక్తిపై తిరుమల టూటౌన్ పోలీసులు సోమవారం రెండు వేర్వేరు కేసులను నమోదుచేశారు. విజిలెన్స్ వింగ్ అధికారులు తెలిపిన వివరాల మేరకు హైదరాబాద్ తిరుమల నగర్‌కు చెందిన శేషభట్టర్ వసంతకు తిరుమలలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న నాగభూషణం, ట్యాక్సీ డ్రైవర్ నాగరాజుతో కలిసి నాలుగు సుపథం టికెట్లను రూ.12వేలకు విక్రయించాడు. దీనిపై ప్రైవేటు సెక్యూరిటీ గార్డ్ ఫోన్లో మాట్లాడుతుండగా విజిలెన్స్ వింగ్ అధికారులు పట్టుకున్నారు. వీరిని తిరుమల టూటౌన్ పోలీసులకు అప్పగించగా పోలీసులు కేసు నమోదుచేసి ఇద్దరు దళారులను అరెస్ట్‌చేశారు. సదరు టికెట్లను ఓ టీటీడీ ఉద్యోగి నుంచి సేకరించినట్లు గుర్తించారు. అతనిని పట్టుకుని విచారించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.

మరో కేసులో దువ్వూరుకు చెందిన ప్రభాకర్ రెడ్డి అనే వ్యక్తి శ్రీవారి బ్రేక్ దర్శనం కోసం దళారి రాజశేఖర్‌ను సంప్రదించారు. దళారి భక్తుడి నుంచి రూ.12వేలు వసూలు చేసి ఆరు టికెట్లు వారికి ఇచ్చాడు. ఆ టికెట్లు తీసుకుని భక్తుడు దర్శనానికి వెళ్లగా అవి నకిలీ బ్రేక్ దర్శన టికెట్లని విజిలెన్స్ అధికారులు తెలిపారు. బాధిత భక్తుని ఫిర్యాదు మేరకు తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

లక్ష్యాలు చేరుకోకుంటే చర్యలు


మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): ఉపాధి హామీ పనుల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకుంటే చర్యలు తప్పవని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం తొట్టంబేడు పంచాయతీ పరిధిలోని జీవనోపాధి వనరుల శిక్షణాకేంద్రం(సీఎల్ఆర్‌సీ)లో శ్రీకాళహస్తి డివిజన్లోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రి, సత్యవేడు, వరదయ్యపాళెం, కేవీబీపురం, వెంకటగిరికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా ఈ ఏడాదికి నిర్దేశించిన లక్ష్యాలపై ఆరాతీశారు. బాగా వెనుకబడిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఏపీడీలు ప్రేమకుమార్, స్వామిదాసు, ఏపీఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఒకరికి తీవ్ర గాయాలు


విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన వైర్లు


పెంచలకోనలో గాయపడిన తిరుపాల్‌ను పరామర్శిస్తున్న చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి

రాపూరు: పెంచలకోన క్షేత్రంలోని దేవస్థాన దుకాణాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. పెంచలకోనలోని దేవస్థాన దుకాణాలపై 11కేవీ విద్యుత్ వైర్లు వెళ్తుండగా.. అందులో ఒక వైరు తెగిపోయింది. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. వైర్ల నుంచి విద్యుత్ రిటర్న్ సప్లై రావడంతో పలువురు షాక్‌కు గురయ్యారు. ఇందులో టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న తిరుపాల్ తీవ్రంగా గాయపడగా.. హరిబాబు అనే యువకుడి నాలుకపై గాయమైంది. దుకాణాల్లోని విద్యుత్ మీటర్ల నుంచి, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, గ్రైండర్లు, టీవీలు తదితర గృహోపకరణాల నుంచి పొగలు వచ్చాయి. విషయం తెలుసుకున్న దేవస్థానం చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, ఏసీ జనార్దన్ రెడ్డి, సీఐ కోటేశ్వరావు, ఎస్ఐ క్రాంతికుమార్, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, మధు రెడ్డి, నరసింహారెడ్డి, కలపాటి మధుసూదన్‌రెడ్డి, విద్యుత్‌శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. తర్వాత విద్యుత్ వైర్లు మరమ్మతులు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

స్పందనకు 58 ఫిర్యాదులు

తిరుపతి క్రైం: జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి 58 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు నేరుగా హాజరై ఎస్పీని కలిసి తమ సమస్యలను తెలుపుకున్నారు. సమస్యలు విన్న ఎస్పీ ఫిర్యాదులను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసి.. వారికి ఎలాంటి న్యాయం చేశారో తమ కార్యాలయంలో తెలపాలని ఆదేశించారు. భూతగాదాలు, దొంగతనాలు, ఆస్తి వివాదాలపై పెద్ద మొత్తంలో ఫిర్యాదులు అందాయి.


ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

పీఠాధిపతికి చిన్న మర్యాద


శ్రీవారి ఆలయంలో యతిరాజా మఠం పీఠాధిపతి యతిరాజా జీయర్ స్వామిజీ

తిరుమల: యతిరాజా మఠం పీఠాధిపతి ఎతిరాజా జీయర్ స్వామిజీకి టీటీడీ శ్రీవారి ఆలయం తరపున సోమవారం చిన్నమర్యాద చేశారు. శ్రీవారి ఆలయం వద్ద టీటీడీ అర్చకస్వాములు, ఆలయ అధికారులు ఇస్తికఫాల్ స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామితో పాటు వారి శిష్య బృందం కూడా ఉంది.

డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు 7న ఇంటర్వ్యూలు

తిరుపతి తుడా : టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి హృదయాలయం (చిన్నపిల్లల గుండె చికిత్సల) ఆస్పత్రిలో కాంట్రాక్టు ప్రాతిపదికన పేనిచేయడానికి డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ఫిబ్రవరి 7న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు టీటీడీ తెలిపింది. ఇందులో ఓసీ-1, ఎస్సీ-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సేవలందించేందుకు ఎంబీబీఎస్ విద్యార్హత గల అభ్యర్థులకు తిరుపతి బర్డ్ ఆస్పత్రి ప్రాంగణంలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో అదే రోజు ఉదయం 10 గంటలకు వాక్-ఇన్ -ఇంటర్వ్యూ ఉంటుందని వెల్లడించింది. అభ్యర్థులు తమ విద్యార్హతలు, అనుభవానికి సంబంధించిన ధ్రువపత్రాల ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించింది. ఇతర వివరాలకు www.tirumala.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరింది.

నేటి నుంచి ఎస్పీఎల్

- ఉదయం 9గంటలకు ప్రారంభం



తిరుపతి ఎడ్యుకేషన్ : తుమ్మలగుంటలోని డాక్టర్ వైఎస్సార్ క్రికెట్ మైదానంలో మంగళవారం నుంచి సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు సాక్షి బ్రాంచ్ మేనేజర్ సత్యేంద్రబాబు తెలిపారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో ఎస్పీఎల్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా వివిధ కళాశాలల జట్లు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. సీనియర్స్ విభాగంలో 31, జూనియర్స్ విభాగంలో 7, మొత్తం 38 జట్లు తలపడనున్నట్లు తెలి పారు. క్రీడాకారులు తప్పనిసరిగా తెల్లని దుస్తులు, షూ, సేఫ్టీ కిట్స్‌తో హాజరవ్వాలని సూచించారు. క్రికెట్ బాల్స్‌ను తామే అందిస్తామన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని, నిర్ణీత సమయానికి అరగంట ముందే మైదానంలో ఉండాలని, కళాశాల ఐడీ కార్డు, వయో నిర్ధారిత సర్టిఫికెట్లు తీసుకు రావాలని పేర్కొన్నారు. ఐసీసీ నియమ నిబంధనలను అనుసరించి ఈ పోటీలు జరుగుతాయని, అంపైర్‌దే తుది నిర్ణయమని తెలిపారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన వారు రీజనల్ స్థాయికి అర్హత సాధిస్తారన్నారు.

నేడు క్రికెట్ మ్యాచ్‌ల వివరాలు

తొలిరోజు సీనియర్ విభాగంలో క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ పోటీల్లో మొత్తం 12 జట్లు తలపడనున్నాయి.

సమయం	జట్లు	గ్రౌండ్
ఉ: 9	ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల వర్సెస్ ఎస్వీ యూనివర్సిటీ	1
ఉ: 11	ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల (రామచంద్రాపురం)- సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల	1
మ: 2	శ్రీపద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ వర్సెస్ రమణ డిగ్రీ కళాశాల	1
ఉ: 9	ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల (తిరుపతి) వర్సెస్ ఎస్వీఈసీ తిరుపతి	2
ఉ: 11	ఎస్‌డీహెచ్ఆర్ డిగ్రీ కళాశాల వర్సెస్ ఎస్వీసీఈ కళాశాల	2
మ: 2	వీబీఆర్ డిగ్రీ కళాశాల వర్సెస్ ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల	2

7 నెలలు.. 32 బైక్‌లు

- బెట్టింగ్‌ల మోజులో వరుస చోరీలు


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

చిల్లకూరు: ఉన్నత చదువులు చదివాడు.. పలు పరిశ్రమల్లో పనిచేశాడు.. కానీ జల్సాలకు అలవాటుపడి అక్కడ ఇచ్చే వేతనం సరిపోక.. ఇతర మార్గాలను ఎంచుకున్నాడు. పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. ఆ వివరాలను గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరించారు. ఆయన కథనం.. గూడూరు రూరల్ పరిధిలోని మిట్టాత్మకూరుకు చెందిన వీరంరెడ్డి రమేష్‌రెడ్డి గూడూరు పట్టణంలోని తూర్పువీధిలో నివాసం ఉంటున్నాడు. ఇతను ఎంబీఏ వరకు చదువుకుని వైజాగ్, తడలోని శ్రీసిటీలో కొంత కాలం పనిచేశాడు. తర్వాత తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేశాడు. జల్సాలకు అలవాటు పడి ఆయా ప్రాంతాల్లో ఇచ్చే వేతనం సరిపోక బైక్ దొంగతనాలు చేయాలని భావించాడు. ఇలా ఏడు నెలలుగా చెన్నైలోని పొన్నేరి, శ్రీకాళహస్తి, తిరుపతి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాలలో సుమారు 32 బైకులు చోరీ చేశాడు. వాటిని గూడూరు పట్టణంలోని అంబేడ్కర్‌నగర్, రైతు బజార్ వీధి ప్రాంతాలకు చెందిన ఒంటె శేఖర్, సర్వేపల్లి అశోక్‌తో కలిసి విక్రయించి వచ్చిన సొమ్ముతో బెట్టింగ్‌లకు పాల్పడేవాడు. ఈ క్రమంలో ఇటీవల సూళ్లూరుపేటకు చెందిన ఓ పోలీస్ బైక్ చోరీకి గురైంది. ఈ నేపథ్యంలో పోలీసులు రహదారిపై నిఘా పెంచారు. రమేష్‌రెడ్డి వరగలి క్రాస్ రోడ్డులో చోరీ చేసిన బైక్‌పై వెళ్తుండగా ఐడీ పార్టీ పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన బైక్‌ల విలువ రూ.27 లక్షలు ఉంటుందని తెలిపారు. నిందితులను త్వరలో కోర్టులో హాజరుపరచనున్నట్టు డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసు ఛేదించిన చిల్లకూరు ఎస్ఐ గోపాల్‌తో పాటుగా ఐడీ పార్టీ కానిస్టేబుళ్లు రాజు, విష్ణు, ఏఎస్ఐ ఎస్కే సిరాజ్, సిబ్బంది నావూరయ్య, శ్రీనివాసులురెడ్డి, కస్తూరయ్య, నరేష్, రఫీ, వెంకటేశ్వర్లు, రాంబాబు, చిట్టిబాబు, మునిరాజ్‌లను అభినందించారు. ఈ మేరకు ఎస్పీ పరమేశ్వరరెడ్డి చేతుల మీదుగా రివార్డులు అందించారు. ఆయన వెంట గూడూరు ఒకటవ, రెండవ పట్టణ, రూరల్ సీఐలు హజరత్‌బాబు, వెంకటేశ్వర్లు, దశరథరామారావు ఉన్నారు.


స్వాధీనం చేసుకున్న బైక్‌లు

రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్య

చంద్రగిరి: రైలు కిందపడి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని నరసింగాపురం-కొటాల మార్గంలోని రైల్వే పట్టాలపై చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం.. అనంతపురం జిల్లా, నార్పాల మండలం, దుగుడు గ్రామానికి చెందిన జగదీశ్వర్ రెడ్డి(21) పులిచర్ల మండలం, దిగువపాలకలవారిపల్లి సమీపంలోని ఎంజేఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో ఈసీఈ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం జగదీశ్వర్‌రెడ్డి నరసింగాపురం-కొటాల మార్గంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తులో ఉంది.